క్లుప్తంగా

కన్మనూర్‌లో ఆయుర్వేద వైద్యసేవలు



మరికల్: జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మండలంలోని కన్మనూర్ ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా ధన్వంతరి జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగరు, బీపీ, అర్షమొలలు, కాళ్ల నొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఆయుర్వేద మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్‌కుమార్, రుక్మిణిదేవి, అనురాధ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు



ఊట్కూరు: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజు జయమ్మ దంపతులు కూతురు రమాదేవి నీట్‌లో ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్ సీటు సాధించింది. రమాదేవి విద్యాభ్యాసమంతా కొత్తపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, 6 నుంచి 10వ తరగతి వరకు మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలలో సాగింది. ఇంటర్ బూత్పూర్‌లోని జూనియర్ కళాశాలలో చదువుకుంది. నీట్‌లో ప్రతిభ కనబర్చడంతో మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలలో మెడికల్ సీటు లభించింది. ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆమెను గ్రామస్తులు అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



కొత్తపల్లి: మండల పరిధిలోని మన్నాపూర్ గ్రామానికి చెందిన గొల్ల కృష్ణయ్య అలాగే వడ్డె యాదమ్మ, అలివేలు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యచికిత్స కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నగదు మంజూరు చేసింది. కృష్ణయ్యకు రూ.85వేలు, యాదమ్మ రూ.56వేలు అలివేలు రూ.40వేలు మంజూరు కాగా స్థానిక కాంగ్రెస్ నాయకులు చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక మాయం

కృష్ణ: అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులు రోజు గడిచే వరకే మాయమైన ఘటన కృష్ణ మండల పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని పెద్దవాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అనుమతులు పొంది మండల పరిధిలోని ఇట్టుక బట్టిలో అక్రమంగా నిల్వ చేయడంతో సమాచారం అందుకున్న ఆర్‌ఐ శ్రీనివాసుగౌడ్ ఇసుకను సోమవారం సీజ్ చేశారు. అయితే రాత్రి గడిచే సరికి అక్కడ ఉన్న డంపును ఇసుక మాఫియా మాయం చేసింది. దీంతో పలువురు అధికారుల నిర్లక్ష్యంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమార్కులపై ఉక్కుపదం మోపాలని, అదే విధంగా సీజ్ చేసిన ఇసుకను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కొత్తపల్లి: మండల పరిధిలోని కిషన్ నగర్, దుప్పడి గట్టు తండా, తిమ్మారెడ్డి పల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన 20మంది కార్యకర్తలు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ హామీలు మరిచి ప్రతిపక్ష పార్టీ నాయకులపై బెదిరింపులకు పాల్పడుతుండడంతో బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేసి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామన్నారు.

రైటర్‌గా ఎదిగిన రైతుబిడ్డ



మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లికి చెందిన రంగం సుధాకర్ అనే యువకుడు రైతు కుటుంబంలో పుట్టి సాంగ్ రైటర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. బతుకమ్మ సందర్భంగా 'మట్టిలోన పుట్టినావే గౌరమ్మ' అనే పాటను రాశాడు. ఈ పాటను ట్యూన్ కాన్సెప్ట్ కమల్ కళ్యాణ్ సహకారంతో.. హరికథ మూవీ టీం లాంచ్ చేసి సుధాకర్‌ను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



దామరగిద్దలో సామూహిక కుంకుమార్చనలో మహిళలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండో రోజు మంగళవారం మల లాంబిక దేవాలయంలో అమ్మవారు పెద్దమ్మ తల్లిగా, ఎస్ఎస్‌కె ధూళిపేట్‌లో దుర్గాదేవిగా, శక్తి పీఠంలో గాయత్రి దేవిగా, మహంకాళి గుడి దగ్గర బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు.

- మండలంలోని సింగారం, కోటకొండ గ్రామాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సింగారం గ్రామంలోని గట్టుపైన కొలువుదీరిన భవానీ మాత ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా, కోటకొండలో వాసవిమాత ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు.

గాయత్రిదేవిగా అమ్మవారు

మరికల్: దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

సామూహిక కుంకుమార్చన

దామరగిద్ద: మండల కేంద్రంలోని నగరేశ్వర వాసవి మాత ఆలయంలో అమ్మవారిని గాయత్రి అవతారంలో భక్తిశ్రద్ధలతో పూజలందుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

ధన్వాడ: మండలంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు అమ్మవారి ప్రతిమలను భద్రకాలి, సరస్వతిదేవి, గాయత్రిదేవి అలంకరణలో ఏర్పాటు చేసి ప్రత్యేక



మరికల్‌లో గాయత్రి దేవిగా అమ్మవారు



ధన్వాడలో..

పూజలు చేశారు. ధన్వాడ అంబాభవాని దేవాలయంలో మహిళలు కుంకుమార్చణ కార్యక్రమం నిర్వహించారు. గున్ముక్ల గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమ వద్ద మహిళలు భజన నిర్వహించి అన్నదానం చేశారు. రాత్రి సమయంలో యువతులు కోళాటం, దాండియ నృత్యం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు.

మహిళల ప్రత్యేక పూజలు

కోస్గి: దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు మంగళవారం గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి నీలిరంగు చీర, కొబ్బరి అన్నంతో నైవేద్యాన్ని సమర్పించారు. సాయిబాబా ఆలయంలో అంపయ్య , మున్నూర్ వీధిలో అమర



కోస్గిలో పూజలు చేస్తున్న మహిళలు

లింగస్వామి వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజలు జరిపించారు.

మౌలిక సౌకర్యాలు కల్పించండి

కోస్గి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మాబాయి మంగళవారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్, టాయిలెట్స్ , భోజనం చేయటానికి డైనింగ్‌హాల్ , వంటగది , ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. స్పందించిన ఆయన వెంటనే నిధులు మంజూరు చేయాలని కడా చైర్మన్ వెంకట్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆయనను పూలమాలలు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి గోవిందరాజులు , డిప్యూటీ ఈఈ



తిరుపతిరెడ్డి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

విలోక్ , మున్సిపల్ కమిషనర్ నాగరాజు , మండల విద్యాధికారి శంకర్‌నాయక్, మండల అధ్యక్షుడు రఘువర్దన్ తదితరులు ఉన్నారు.

పల్లెగడ్డ ప్రజల తరఫున న్యాయ పోరాటం

మరికల్: దేవదాయ శాఖ నుంచి ముప్పు ఉన్న పల్లెగడ్డ గ్రామ ప్రజల తరఫున న్యాయ పోరాటం చేస్తామని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి కాశీనాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పల్లెగడ్డ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఇచ్చిన నోటీసులు అందుకున్న బాధితులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ చిన్నరాజమూరు ఆంజనేయస్వామి పేరు మీద ఉన్న స్థలంలో దాదాపు 400 ఏళ్ల నుంచి పల్లెగడ్డలో ఇళ్లు నిర్మించుకుంటే ఇన్నాళ్లు దేవాదాయ శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామంలో ఒక ఇల్లు కూడా ఖాళీ చేయకుండా గ్రామస్తులకు మద్దతుగా ఉంటామన్నారు. అధికారులపై ఒత్తిడి పెంచి వారికి ఇళ్ల పట్టాలు వచ్చేలా ఉద్యమాలు చేపడుతామన్నారు. ముందుగా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్, దేవాదాయ శాఖ



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాథ్

చైర్మన్‌లకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే స్పందించి గ్రామ ప్రజలకు ధైర్యం చెప్పి, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాము, గ్రామస్తులు హన్మంతు, రాములు, చిన్న హన్మంతు, వెంకటయ్య పాల్గొన్నారు.

హామీల అమలుకు నేడు ధర్నా

మాగనూర్/కృష్ణ: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమా పూర్తిగా అమలు చేయడంతో పాటు రైతులకు బోనస్ చెల్లించాలని మాగనూర్, కృష్ణ మండలాల బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి, శివరాజ్‌పాటిల్ ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ బుధవారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కృష్ణ మండలం టైరోడ్డులో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండకట్టడానికి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ధర్నాలో ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు బోనస్ చెల్లించాలి

ఊట్కూరు: యాసంగిలో వరి రైతులకు ప్రభుత్వం బోనస్ అందించాలని కోరుతూ మంగళవారం వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డికి పలువురు రైతులు వినతిపత్రం అందించారు.వరి పంట వేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించి ఇప్పటి వరకు బోనస్ ఇవ్వలేదన్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు సురేష్‌గౌడ్, శివారెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి

కృష్ణ: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కాశప్ప అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా వృద్ధులు, దివ్యాంగులకు రూ. 6వేలు, వితంతువులకు రూ.4వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పింఛన్లు కూడా మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దివ్యాంగుల సంఘం మండల నాయకులు పుంజనూర్ బాబు, రవి, చంద్రశేఖర్, అంజనేయులు, దేవప్ప, చంద్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాషా, హన్మంతు, సావిత్రమ్మ, గడుగు రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

నారాయణపేట: శరీర దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి కరాటే శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. నారాయణపేటలోని కేశవ్ మాస్టర్ కరాటే అకాడమీ ఇంటర్నేషనల్‌కు చెందిన రాకేష్, ఆరాధ్య, భాను, శివశంకర్, భవనేష్‌లు ముంబై భీమండిలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో జరిగిన కరాటే టోర్నమెంట్ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారు. ఈ క్రమంలో వారిని రాజ్ కుమార్ రెడ్డి అభినందించారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

మద్దూరు: మండలంలోని ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని మద్దూరు తహసీల్దార్ హెచ్చరించారు. పట్టణంలో పోలీసుల నివాస గృహాలకు కేటాయించిన స్థలం కబ్జాకు గురయిందని తెలుసుకున్న సర్వేయర్ మునిందర్, ఆర్అండ్‌బీ ఏఈ సందీప్ రెడ్డి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. అలాగే ఠాణా సమీపంలో కబ్జాకు గురైన స్థలంలో నిర్మాణాన్ని కూల్చి వేశారు.

నేడు బారంబావి దగ్గర బతుకమ్మ సంబరాలు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని బారంబావి దగ్గర బుధవారం ప్రభుత్వం తరఫున బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ సలీం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బతుకమ్మ సంబరాలకు స్థానిక ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మహిళలు, నాయకులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గోవుల తరలింపు అడ్డగింత

నారాయణపేట టౌన్: నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామ సమీపంలో ద్వారకా స్కూల్ ముందు ఉన్న వ్యవసాయ పొలంలోకి ఆటోలో గోవులను తరలిస్తుండగా జాజాపూర్ భజరంగ్ దళ్ నాయకులు అడ్డుకున్నారు. గోవుల తరలింపుపై ప్రశ్నించగా పొంతన లేని సమాధానం ఇచ్చారు. దీని భజరంగ్ దళ్ నాయకులు గోవులను పోలీస్ స్టేషన్‌కు తరలించి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేయించారు. తదనంతరం గోవులను జాజాపూర్ భజరంగ్ దళ్ అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో గోశాలకు తరలించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

నారాయణపేట టౌన్: ప్రజలు ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. కలెక్టర్ శిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో కురిసిన అకాల వర్షాలకు మురికి కాల్వలు నిండి రోడ్డుపై చెత్త పేరుకుపోగ పారిశుద్ధ్య కార్మికులతో తీయించారు. అదే విధంగా రాష్ట్ర పండగ బతుకమ్మ సంబరాల కోసం స్థానిక బారం బావి దగ్గర శుభ్రం చేయించారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

కోస్గి: పంచాయతీ కార్మికుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎదిరింటి నర్సింములు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. కనీస వేతనం అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 30 శాతం పీఆర్సీని అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పని చేస్తూ చనిపోతే కార్మికుల కుటుంబాలకు గ్రాడ్యూటీని, ఇన్సురెన్స్‌ను అమలు చేయాలని కోరారు. అనంతరం మండల కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాములు , మొగులయ్య , అంజిలప్ప , నాగప్ప , మొగులయ్య , కృష్ణ పాల్గొన్నారు.



విపతిపత్రం అందిస్తున్న నాయకులు

'బీజేపీ బలోపేతానికి కృషి చేద్దాం'

నారాయణపేట: జిల్లాలో బీజేపీని బలోపేతం చేయడమే ధ్యేయంగా పని చేస్తానని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మి వెంకట శ్యామ్ సుందర్ గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మితో పాటు జిల్లా కార్యదర్శి సుజాతను మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గ్రామ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం పథకాలు తీసుకెళ్లి పార్టీని రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అనంతరం జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపీ డీకే అరుణ, బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ, రాష్ట్ర నాయకులు రతంగ్ పాండు రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా,పట్టణ నాయకులు లలితా వెంకట్ రెడ్డి, వేంకటేశ్వమ్మ, యాదమ్మ, మండల బీజేపీ అధ్యక్షుడు జ్యోతి, సుజాత, నాయకులు కృష్ణ, శ్యామ్ సుందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్యదర్శిని సన్మానించిన నాయకులు

బతుకమ్మ సంబరాలు విజయవంతం చేయాలి

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మద్దూరు మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు.మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మద్దూరులో విలీనమైన గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బుక్ కీపర్లు సిబ్బందితో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విలీన గ్రామాల్లో వీధిదీపాలను ఏర్పాటు చేసి ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ సంబరాలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. చివరి రోజున నిర్వహించే సద్దుల బతుకమ్మ సంబరాలను విధిగా జరుపుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

శక్తి పీఠాన్ని దర్శించుకున్న సినీనటులు



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానం శక్తి పీఠాన్ని తెలుగు సీరియల్ నటులు విష్ణుప్రియ, సిద్ధు దంపతులు దర్శించుకున్నారు. దసరా నవరాత్రులలో భాగంగా మంగళవారం నారాయణపేటకు వచ్చి శక్తి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని హోమం చేసి భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం శక్తిపీఠం సురభి గోశాలను సందర్శించారు.

కోటకొండలో మెగా వైద్యశిబిరం

నారాయణపేట: మండలంలోని కోటకొండ గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం 'స్వస్థ్ నారి- సశక్త్ పరివార్' హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ప్రతిభా భారతి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అక్టోబర్ 1 వరకు క్యాంపులు కొనసాగుతాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

బాలల హక్కులపై అవగాహన

మద్దూరు: మండల పరిధిలోని పల్లె గడ్డ తండా గ్రామ పంచాయతీలో ఉమెన్ అండ్ చైల్డ్ సంస్థ వారి ఆధ్వర్యంలో మంగళవారం బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ మన్వయ కర్త నర్సింములు మాట్లాడుతూ బాలల హక్కుల గురించి వివరించి, వారికి కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 18 ఏళ్లు నిండని పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవన్నారు. బాల కార్మికులు లేని ఆదర్శ గ్రామంగా ఉండేలా గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, అంగన్‌వాడీలు, మహిళా సంఘం నాయకులు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, అనిల్ నాయక్, లక్షణ్ నాయక్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా రవికుమార్

మక్తల్: మక్తల్ కిరాణం, జనరల్ కన్వేక్షనరి అధ్యక్షుడిగా ఉందేకోడ్ రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం స్థానిక అసోసియేషన్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడిగా రఘుప్రసన్నబట్, నూర్‌భాషా, వెంకట్‌రెడ్డిలు, ప్రధాన కార్యదర్శిగా మనసాని రంజిత్, కోశాధికారిగా పవన్‌కుమార్‌లు ప్రమాణం చేశారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ భవనంలో అన్ని వసతులు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సభలు పెట్టినా.. స్పందన కరువు

- రైతు ఉత్పత్తిదారుల సభ్యత్వ నమోదుకు వెనుకడుగు
- ఎంపిక చేసిన ప్రతి విండోలో 750 సభ్యత్వాలు తప్పనిసరి



గ్రామసభలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సింగిల్ విండో అధికారులు (ఫైల్)

మరికల్: రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఒక అడగు ముందుకు మూడు అడగులు వెనక్కి అన్నట్లుగా సాగుతుంది. జిల్లాలో నాలుగు సింగిల్ విండోలను ఎఫ్‌పీఓకి ఎంపిక య్యాయి. గత 2 నెలల నుంచి రైతు ఉత్పత్తిదారుల సంస్థపై అవగాహన కల్పించేందుకు అధికారులు సింగిల్ విండో పరిధిలోని ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి సభ్యత్వల నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు. కానీ ఒక్కొక్క రైతు సభ్యత్వ నమోదుకు రూ. 2 వేలు చెల్లించాల్సి రావడంతో వెనకడగు వేస్తున్నారు.

రైతుల అభివృద్ధి కోసం..

కేంద్ర ప్రభుత్వం ఏకకాలంలో సింగిల్ విండోలతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో రైతు ఉత్పత్తిదారుల సంస్థను సింగిల్ విండోల్లో ఏర్పాటు చేసింది. కేంద్రంలో సహకార మంత్రిగా ఉన్న అమిత్‌షా సింగిల్ విండోల అభివృద్ధి సాధిస్తే దేశ ఆర్థిక పరిస్థితికి తోడ్పాటు అందించినట్లు అవుతుందని, ఆర్థికవృద్ధి రేటు పెరుగుతుందని ఆశించి ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేశారు. సింగిల్ విండోల ద్వారా రైతులకు అపరిమితమైన సేవలందించాలన్నది కూడా ఎఫ్‌పీవోల ఏర్పాటుకు కారణమని చెప్పొచ్చు. వీటి పరిధిలోని రైతులు సభ్యత్వం తీసుకోవాలి. ఇందుకు ఒక్కొక్క రైతు రూ. 2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఎంపిక చేసిన ప్రతి విండోలో కనీసం 750 మంది రైతులను సభ్యత్వం అందజేయాలి. ఈ సభ్యత్వం ద్వారా రూ.15 లక్షలు సేకరించాలి. ఇలా సేకరిస్తే కేంద్ర ప్రభుత్వం అంతే స్థాయిలో గ్రాంటు కింద నగదు అందజేస్తుంది. ఇలా జమయ్యే మొత్తం రూ.30 లక్షలతో సింగిల్ విండో సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాల్సి ఉంటుంది. దీని ద్వారా ప్రధానంగా రైతులకు అవసరమైన వ్యవసాయ సరుకులు అందజేయడానికి ఉపయోగపడుతుంది. అంతేకాకుండా రైతులు పండించిన ధాన్యానికి మార్కెట్ వ్యవస్థ కల్పించి కొనుగోలు చేస్తారు.

నాలుగు విండోలో సభ్యత్వాలు ఇలా...

సభ్యత్వ నమోదులో ధన్వాడ సింగిల్‌విండో ప్రస్తుతానికి ముందంజలో ఉండగా, ఈ విండోలో ఇప్పటి వరకు 536 మంది రైతులకు సభ్యత్వాన్ని అందజేసింది. మిగిలిన మూడు విండోలు బాగా వెనకబడి ఉన్నాయి. ఊట్కూరు అత్యల్పంగా 87 మంది రైతులతో సభ్యత్వం చేయించగా, తీలేర్‌లో 100 మంది, మాగనూర్‌లో 120 మంది రైతులు సభ్యత్వం పొందారు. లక్ష్యం చేరుకోవాలంటే సిబ్బంది మరింత కష్టపడాల్సిందే.

> **వేగవంతం చేస్తాం**
>
> జిల్లాలో రైతుల సభ్యత్వాల నమోదు ప్రక్రియలో వెనుకబడిన సహకార సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించాం. లక్ష్యాన్ని ఎంత త్వరగా చేరుకుంటే అంతే తర్వగా కేంద్రం ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ఈ విషయాన్ని విండో అధికారులకు కూడా వివరించాం. ప్రస్తుతం రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య తీరగానే సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం చేస్తాం.
>
> –శంకరాచారి, సహకార సంఘాల జిల్లా అధికారి, నారాయణపేట